కథా నిలయం
శ్రీకాకుళం

# వారసుడు

**-తాటికోల పద్మావతి**

'ఎదురింటి జానకమ్మ కోడలికి తొమ్మిదో నెల వచ్చిందట. శ్రీమంతం చేయటానికి తల్లిదండ్రులు వచ్చారు హైదరాబాదు నుంచి. సాయంత్రం పేరంటం పిలవటానికి జానకమ్మ వియ్యపురాలిని వెంటబెట్టుకొని వచ్చింది.

మంగతాయారు, జానకమ్మ ఎదురు బొదురు ఇళ్ళు. రోజూ కాలక్షేపం కోసం ఒకచోట కూర్చుని పిచ్చాపాటి కబుర్లు చెప్పుకొంటారు. ముఖ్యమైన స్నేహితురాలు మంగతాయారుని పేరంటం పిలవటానికి వచ్చింది జానకమ్మ.

వియ్యపురాలు బొట్టు పెట్టి, "సాయంత్రం మా అమ్మాయికి శ్రీమంతం చేస్తున్నాం, పేరంటానికి తప్పకుండా రండి" అంటూ బొట్టు పెట్టి చెప్పింది. లోపల నుంచి మంగతాయారు కోడలు విశాలి కూడా వచ్చింది. "మీ కోడలా?" అంటూ ఆమెక్కూడా బొట్టు పెట్టి చెప్పింది.

వాళ్ళిద్దరూ అటు వెళ్ళగానే నోరు విప్పింది మంగతాయారు. "నిన్న గాక మొన్న పెళ్ళయింది. వెంటనే నెల తప్పింది. రేపో మాపో బిడ్డ పుడతాడు. మనవడిని ఎత్తుకొనే అదృష్టం జానకమ్మకొచ్చింది. నేనూ ఉన్నాను ఎందుకు, కొడుక్కి పెళ్ళయి ఏడేళ్ళయింది. ఇదిగో పుడతారు, అదిగో పుడతారంటూ ఎదురు చూశాను. పిల్లా లేరు జెల్లా లేరు. మీ కోడలికి ఇంకా పిల్లలు పుట్టలేదా. ఎవరికైనా డాక్టర్‌కి చూపించలేకపోయారా! అని నా ముఖాన అడుగుతుంటే సమాధానం చెప్పలేక ఛస్తున్నాను. అసలు నాకు మనవళ్ళని ఎత్తుకొనే అదృష్టం ఉందో లేదో. దేనికైనా అదృష్టం ఉండాల"ంటూ మనసులోని బాధనంతా వెళ్ళగక్కింది.

అత్తగారు మాటలు ఈటెల్లా తగిలినా ఎన్నోసార్లు విని ఊరుకోవటం తప్ప ఏం మాట్లాడదు విశాలి. సాయంత్రం పేరంటానికి రమ్మన్నా వెళ్ళలేదు. మంగతాయారు మాత్రం పట్టుచీర కట్టుకొని తయారై వెళ్ళింది.

"రా వదినా! కూర్చో! మీ కోడలు రాలేదా! రావాలని ఉన్నా తనకి ఇలా జరగలేదని మనసులో బాధ. ఏం చేస్తాం. మన చేతుల్లో ఏముంది. చేసుకొన్న అదృష్టం బట్టి మా కోడలికి పెళ్ళయిన సంవత్సరంలోనే పిల్లలు పుడతున్నారు. ఏడేళ్ళయినా మీ కోడలికి ఇంకా పుట్టలేదంటే ఏదో లోపం ఉండి ఉంటుంది. నువ్వు మాత్రం ఏం చేస్తావు. నీకూ మనవడిని ఎత్తుకోవాలని ఉండదా ఏమిటి? కూర్చో వదినా! అందరికీ తాంబూలాలు సిద్ధం చేసి వస్తా"నంటూ మంగతాయారు మనసులో మంటలు ఎగదోసింది జానకమ్మ.

శ్రీమంతం ఘనంగా చేశారు. కోడలికి నెక్లెస్ చేయించింది జానకమ్మ. పుట్టింటి వారు పదివేల రూపాయల పట్టుచీర పెట్టారు. నాలుగు రకాల స్వీట్లు, హాట్లు, ఒక స్టీలు డబ్బాలో వేసి వచ్చిన వాళ్ళందరికీ పంచారు.

"వస్తాను వదినా. శ్రీమంతం బాగా చేశారు. ఎంతయినా నీ కోడలు అదృష్టవంతురాలు" అంటూ మధ్య మధ్యలో పలుకరిస్తుంటే వారితో మాట్లాడి రాత్రి తొమ్మిది గంటలకు ఇల్లు చేరింది. 'అంతా నువ్వెపుడు మనవడిని ఎత్తుకొంటావ'ని అడిగేవారే! ఏం చేస్తాను తలదించుకొంటూ వచ్చానంది.

సాయంత్రం ఆఫీసు నుంచి బజారుకెళ్ళి వచ్చే

## ఓవర్స్

నివురుగప్పిన నిప్పులావుంది
జీవితం
ఎపుడైనా మండచ్చు
మంటలు ఆకాశాన్ని అంటించవచ్చు
నన్నేగాదు
నిన్నూ బూడిద చేయచ్చు
ఈ జీవితమే మంటగా మారినపుడు
సూర్యుడెందుకూ?
చీకటి వెలుగుల మధ్య
నిరంతర మంట ప్రయాణమైనపుడు
అగ్గిపుల్లెందుకూ?
నన్ను చూచి
వాడు తగులబడుతున్నాడని నవ్వకు
నిన్ను దహనం చేయటానికే
నేను మంటనయ్యాను

**-సి హెచ్. మధు**

టప్పుడు పూలు, పండ్లు, స్వీట్లు కూడా కొనుక్కొచ్చాడు శ్రీరాం. విశాలి లోపలి గదిలో మంచం మీద పడుకొని ఏడుస్తున్నది. పిల్లలు పుట్టకపోవడం తన తప్పా. అత్తగారి సూటిపోటి మాటలతో మనసు గాయపడింది. ఎంత కాలమని ఓర్చుకోగలదు. డాక్టర్ దగ్గరికి వెళ్ళామని ఎన్నోసార్లు చెప్పింది. ఇప్పటినుంచే పిల్లల ఝంఝాటం ఎందుకంటూ కొన్నాళ్ళు హాయిగా ఎంజాయి చేద్దామన్నాడు. శ్రీరాంకి పిల్లలంటే ఇష్టం లేదా. ఎందుకిలా సంవత్సరాలు గడుపుతాడు. అందరి దృష్టిలో నేనొక గొడ్రాలిగా కనిపిస్తున్నాను. ఇక భరించడం నా వల్ల కాదు. ఈ రోజు అటో ఇటో తేల్చుకుంటాను. ఈ నరకం అనుభవించడం నా వల్ల కాదనుకొంది.

శ్రీరాం లోపలికి రాగానే భార్య కనిపించక పోయేసరికి అటూ ఇటూ వెతుకుతున్నాడు. ఆ టైములో మంగతాయారు టీవీ ముందు కూర్చుని ఉంది.

"అమ్మా, విశాలి లేదా?" అని అడిగాడు. "లోపల గదిలో ఉండి ఉంటుంది. ఆ పూలు, పండ్లు అంత డబ్బు తగలేసి కొంటావు. మీ ఆవిడ ఏమన్నా నెల తప్పిందా? ఏమన్నానా. బలానికి పళ్ళుతెచ్చిపెడు తున్నావు. కడుపుతో ఉన్నవాళ్ళు తింటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడతాడు. పిల్లా లేరు పీచు లేదు. తిండికి మాత్రం ఏ లోటు లేదు" అని అంది మంగ తాయారు.

"ఏంటమ్మా ఆ మాటలు? పిల్లల్ని కంటేనే పండ్లు తింటారా? లేకపోతే తినకూడదా? ఎప్పుడు చూసినా పిల్లలు పుట్టలేదని ఆడిపోసుకుంటావు. పిల్లల్ని కనా ల్సింది మేము. పిల్లలు కావాలా వద్దా అని నిర్ణ యించుకునేది మేము. కావాలంటే కంటాం. అక్కర్లేదనుకొంటే మానేస్తాం" అని అన్నాడు శ్రీరాం.

"ఇన్నేళ్ళయినా పిల్లలు పుట్టలేదంటే అది లోపం అనే చెప్పాలి. ఏడేళ్ళయినా పిల్లలు లేరు. వంశం నిలబెట్టడానికి నాకు మనవడు కావాలి. ఏం చేస్తావో ఏమో నాకు తెలియదు. మరో ఆర్నెల్లు చూస్తాను. శుభవార్త కనుక చెప్పకపోయారంటే ఇంక నీ భార్యకి పిల్లలు పుట్టరు. నీ భార్యకు విడాకులిప్పించేసి, నీకు రెండో పెళ్ళి చేస్తాను" అంది మంగతాయారు.

"విశాలి వింటే ఎంతో బాధపడుతుంది. పుడితే పుడతారు. లేకపోతే లేదు. పుట్టని పిల్లల కోసం భార్యకు విడాకులిచ్చేసి మళ్ళీ పెళ్ళిచేసుకోవడానికి నేను సిద్ధంగా లేను" అంటూ తల్లి మీద కోపంతో చేతిలో ఉన్న పూలు,

## నిరంతర కృషి

నిరంతరం సేద్యం చేస్తూనే ఉన్నాను
మరకతాల్లాంటి పంటలు పండడం లేదు
మనోభూమిని దున్నుతూనే ఉన్నాను
సంకల్పాల విత్తనాలను నాటుతూనే ఉన్నాను
యోగాల వానలు కురవడం లేదు
ఆహ్లాదాల చిరుజల్లులతో
అవనిని తడుపుతూనే ఉన్నా
ఆశలు మొలకెత్తడంలేదు
అయినా సహకార సరస్సుల నీళ్లు మళ్లించి
అనవరతం సేద్యం చేస్తూనే ఉన్నా
అవరోధాల తెగుళ్లు
అనుదినం వెంటాడుతున్నాయి
ఇంతటి నష్టవ్యవసాయానికి అంతం ఎప్పుడు?
ఇష్టమైన ధాన్యం ఇంటికి వచ్చేదెప్పుడు?
కష్టకాల పరీక్షలో ఉత్తీర్ణత ఎప్పుడు?
అంతులేని నిరీక్షణకు
అతిమధురమైన ముగింపు ఎప్పుడు?

## స్వరాగాలాపన

పాడిందే పాడుతున్న మనిషికి
పాటలోని మాధుర్యం అంతుపట్టడం లేదు
కోటలు దాటే పాండిత్య పాటవంలో
మేటి సొగసులన్నీ మటుమాయమౌతున్నాయి
రాగమంటే అనురాగమనీ
తాళమంటే గుండెలయ అనీ
పల్లవి అంటే చిగురించే ఆశ అనీ
ఎన్నిసార్లు ఎలుగెత్తిచాటినా
అన్నింటినీ మరచిపోతున్న తీరు
ఆనందానికి అవరోధమైన బేజారు
అడుగడుగునా కనబడుతుంటే
వాద్యాల హోరు వినబడుతుంటే
ఎలా సాగుతుంది గీతసాధన?
ఎదుగూ బొదుగూ లేని నీతి బోధన?
అందుకే కొత్త పాట పాడితే మంచిది
కోకిల వసంతంలో పాడినట్లు!
కేకి పురివిప్పి ఆడినట్లు!!

–డా॥ అయాచితం నటేశ్వరశర్మ

పళ్ళు అక్కడ కుర్చీలో పడేసి గదిలోకి వెళ్ళాడు.

విశాలి వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్నది. భార్య పక్కనే కూర్చుని ముఖం మీద ముంగురులు సవరిస్తూ, "విశాలీ! అమ్మ మాటలకు బాధపడుతున్నావా. అసలు ఆమె మాటలు పట్టించుకోవద్దు. నేను నిన్ను పిల్లలు కావాలని గాని, లేరని గాని అనడం లేదుగా. నేను నిన్ను ఒత్తిడి చేస్తే నువ్వు బాధపడాలి. నువ్వలా బాధపడితే నేను చూడలేను. లేచి ముఖం కడుక్కుని రా. భోజనం చేద్దాం."

"నాకు ఆకలిగా లేదు. మీరు చేసిరండి" అంది.

"నువ్వు తినకపోతే నేనూ తినను" అంటూ భార్య పక్కనే మంచం మీద నడుం వాల్చాడు.

"రేపు మనం ఆస్పత్రికి వెళ్దాం" అంది విశాలి.

"జానకమ్మ కోడలి సీమంతానికి వెళ్ళి వచ్చినప్పటి నుంచి నన్ను సాధిస్తూనే ఉంది మీ అమ్మ. చూశారుగా ఇందాక ఏమన్నారో. పిల్లలు పుట్టకపోతే మీకు మళ్ళీ పెళ్ళి చేస్తారుట. ఇంట్లో వాళ్ళ చేత, బయటి వాళ్ళ చేత నన్ను గొడ్రాలివనిపించుకోవడం నాకు ఇష్టం లేదు."

ఒక్కసారి ఆలోచించాడు శ్రీరామం. "అలాగే రేపు మనం ఆస్పత్రికి వెళ్దాం" అన్నాడు.

'నిజమా' అన్నట్టు భర్తవైపు చూసింది విశాలి.

"నిజంగా చెప్తున్నాను. ఇప్పటికైనా భోజనానికి వస్తావా?" అన్నాడు.

విశాలి లేచి ముఖం కడుక్కుని భోజనాలు వడ్డించింది. అత్తగారితో మాట్లాడలేదు. తన పని ముగించుకుని వెళ్ళి గదిలో పడుకొంది.

తెల్లవారాక కూడా మంగతాయారమ్మ నిద్ర లేవలేదు. ఒక్కపనీ ముట్టుకోలేదు. విశాలి ముందుగానే అన్ని పనులు చకచకా చేసేసింది. "వంటయింది, భోజనానికి రండి' అంది అత్తగారితో విశాలి.

"నాకు ఆకలిగాలేదు" అంటూ ముసుగుపెట్టి పడుకుంది మంగతాయారమ్మ.

శ్రీరాం సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ఆస్పత్రికి వెళ్ళారు. ఇద్దరికీ పరీక్షలు చేసి, 'విశాలిలో ఏ లోపం లేదు' అన్నారు. దాంతో శ్రీరాం ముఖం పాలిపోయింది. ముఖంలో విషాదం అలముకుంది. భార్యవైపు తలెత్తి చూడలేక పోయాడు. విశాలి మౌనంగా భర్త స్కూటరు మీద కూర్చుంది.

"ఎక్కడికండీ ఇటు తీసుకెళ్తున్నారు. మనం ఎక్కడికి వెళుతున్నాం?"

శ్రీరాం పలకలేదు. స్కూటర్ పార్కు ముందు ఆగింది. భర్తను అనుసరించింది విశాలి. ఇద్దరూ పార్కులోని బెంచీ మీద కూర్చున్నారు. ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలుతోంది.

"ఏమిటండీ అలా ఉన్నారు. ఆస్పత్రిలోనే మిమ్మల్ని గమనించాను. డాక్టర్ మీతో ఏమైనా చెప్పారా? నాలో ఏ లోపం లేదన్నారు. మీరు నా దగ్గర ఏదో దాస్తున్నారు. నిజం చెప్పండి. నేను బాధపడకూడదని అలా చెప్పి ఉంటారు. నిజంగా నాకు పిల్లలు పుడతారా?" అని భర్తను ప్రశ్నించింది విశాలి.

## ఎన్ని-కల్లలో!

అధికారపు నెత్తురు
రుచిమరిగిన వ్యాఘ్రం
గోముఖాన్ని ధరిస్తున్నది
అంగుళం కదలలేని
పార్టీ తాబేలు
కుందేళ్ళలా గెంతుతానని చెబుతున్నది
మత ఛాందసపు
విషనాగు
వానపామై సంచరిస్తున్నది
పార్టీ ఫిరాయింపుల
దీర్ఘ జీవి కాకి
కోకిల గానం ఆలాపిస్తున్నది
సామాన్యులను
సజీవంగా పీక్కుతినే
రాజకీయ రాబందు
రామచిలుకై
జ్యోతిష్యాలు పలుకుతున్నది
డార్విన్ సిద్ధాంతం
పెడద్రోవ పట్టిందేమోనని
భయపడకండి
ఇదేదో
కొంగ్రొత్త ఋతువొచ్చిందని
భ్రమపడకండి
మళ్లీ ఒకసారి
ఎన్నికలొచ్చాయి
అంతే!

-రవిఠాకుర్

శ్రీరామం మాట్లాడలేదు. ఆ మౌనం విశాలిని మరింత బాధించింది. "చెప్పండి! ప్లీజ్! నాకు పిల్లలు పుట్టకపోతే విడాకులిచ్చేసి మరో పెళ్ళి చేసుకుంటారా? పిల్లలు పుట్టకపోవడానికి నాదే తప్పంటారా? నాలో ఏ లోపమూ లేదని డాక్టర్లు చెప్పారు కదా. అయినా ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారు?" దుఃఖంతో పూడుకు పోతున్న గొంతుతో అంది విశాలి.

"మాట్లాడరేమండి. నా మీద మీక ప్రేమ లేదా? ఇప్పుడు నన్ను వదిలించుకోవాలని చూస్తున్నారా? మీరు గనుక నిజం చెప్పకపోయారంటే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటాను" అని బెదిరించింది విశాలి.

విశాలి కన్నీరు శ్రీరాంను కదిలించి వేసింది. "నువ్వు ఎప్పటికీ నా భార్యవే. నీకు విడాకులిచ్చి మళ్ళీ పెళ్ళిచేసుకుంటానని ఎలా అనుకున్నావు" అని ప్రశ్నించాడు శ్రీరాం.

"మీ అమ్మ నిన్న మీతో అన్న మాటలు మరచి పోయారా? ఆవిడ అనుకున్నంత పనీ చేసి తీరుతారు. నాకు ఆ ఇంట్లో ఉండాలంటే భయంగా ఉంటోంది" అని బేలగా అంది విశాలి.

"నువ్వు భయపడాల్సిన పనిలేదు. నే చెప్పింది విని నువ్వు నిర్భయంగా ఉండు. నిజంగా ఇప్పుడు భయపడాల్సింది నేను. నేను నీ స్థానంలో ఉండి ఆలోచిస్తున్నాను" అన్నాడు శ్రీరాం.

"ఏమిటి మీరు చెప్పేది?"

"నాలో లోపం ఉండి పిల్లలు పుట్టలేదనుకో. నువ్వు నాకు విడాకులిచ్చేసి, పిల్లల కోసం మళ్ళీ పెళ్ళి చేసుకుంటావా?" భార్యని ప్రశ్నించాడు శ్రీరాం.

"అవేం మాటలండీ. ఇంతవరకు పిల్లల కోసం మరో పెళ్ళి చేసుకున్న ఆడదాన్ని నేనెక్కడా చూడలేదు. ఆప్యాయత, అనుబంధాల్ని దూరం చేసుకోవడానికి పిల్లలే కారణమైతే నాకు అసలు పిల్లలే వద్దు. జీవితాంతం మనం ఒకొరికొకరం తోడుగా ఉందాం" భర్తను అనునయించింది విశాలి.

ఆ మాటలు శ్రీరాంకి కొంత ధైర్యాన్ని ఇచ్చాయి. జరగబోయే పరిణామాలకు ఎదుర్కోవడానికి ఇద్దరూ సంసిద్ధులయ్యారు.

బాగా చీకటి పడడంతో ఇంటికి బయలుదేరారు ఇద్దరూ.

"ఆస్పత్రికి వెళ్ళారా? డాక్టర్‌ని కలిశారా? ఏమన్నారు? అసలు పిల్లలు పుడతారని చెప్పారా?" గుమ్మం లోనే ప్రశ్నల వర్షం కురిపించింది మంగతాయారు.

"ఎందుకమ్మా అంత తొందర. నువ్వు పెట్టిన గడువు ఆర్నెలలు. అప్పటిదాకా ఆగు" అన్నాడు శ్రీరాం.

"ఆ గడువు లోపల శుభవార్త చెప్పలేకపోయావో, నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుని తీరాల్సిందే" అంది మంగతాయారు.

"నీకు మనవడు కావాలి. అంతేగదా. ఆరు నెలల తర్వాత నీ చేతిలో మనవడుంటాడు" అన్నాడు శ్రీరాం.

"నాకు విశాలి కడుపున బిడ్డ కావాలి. అంతేకానీ,

## సెలవులే సెలవులు!

**కం**దిపచ్చడి ప్లస్
ఆవకాయ అంటే ఎంతిష్టమో...
చికెన్ బిర్యానీ
అంటే ఎంత లైకింగో...
సెలవు దినాలంటే అంత ప్రీతి!
పండుగ సెలవులు... జాతీయ సెలవులు...
రాష్ట్రీయ సెలవులు... బర్త్‌డే... మృత్యుడే సెలవులు
పోరాటాల సెలవులు... ఆరాటాల సెలవులు
బంద్‌ల సెలవులు...
భార్య డెలివరీకి భర్తకి సెలవు!
భర్త నీళ్లాడితే భార్యకి సెలవు!
ఇలా... ఇలా... మున్నూట అరవై అయిదు రోజుల్లో
సగానికి సగం సెలవు దినాలే!
ఇవి చాలదన్నట్టు...
ఐచ్ఛిక సెలవులు... ఎరన్డ్ లీవులు...
మెడికల్ లీవులు... ఫామిలీ ప్లానింగ్ సెలవులు...
అబ్బో... అబ్బబ్బో... ఎన్నని చెప్పటం!
పనిదినాలు చిక్కి శల్యమైపోతున్నా...
ఇసుమంతైనా లేదు బాధ!
జాతీయ ఉత్పాదకత
సెలవుల సుడిగాలికి కొట్టుకుపోతోంది!
చీమకుట్టినట్టయినా అన్పించదు!
ఎన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామో
ఎంచటం కష్టసాధ్యమౌతోంది!
వెనకటికి ఎవడో అన్నాడు...
భారతీయులు బహు బద్ధకస్తులని!
'కష్టే ఫలే' అవుట్‌డేటెడ్!
'రెస్ట్ మిలే' నేడు సూటబుల్!!

–యస్. వివేకానంద

## దుర్గం చెరువు

ఏ పొద ఎద తడిమినా
తీయని గుసగుసల పదనిసలు
రాతి పలకలే శయ్యాతల్పాలు
గడ్డిమొలకలే మెత్తటి పరుపులు
పట్టపగలే పదిమంది ఎదురుగా
ప్రణయకేళీ విలాసాలు
సిగ్గుని హైహీల్స్ మొనలతో చంపేసి
ఆకాశంలోనే కాదు
నిర్లజ్జలో కూడా సగమే
అంటున్న అమ్మాయిలు
ముద్దుల చప్పుళ్ళు
యువతరం గుండె డప్పుల్లా
సిగ్గుతో ఘనీభవించి
నిశ్శబ్ద సాక్షిగా మిగిలిన కొండరాళ్ళు
విదేశీ బీచుల్లో కన్పించే
నీలివిషం చిమ్మే పాము
వేయి పడగల్తో సంచరిస్తూ
భావితరానికి ప్రతినిధులు
గాలి పడవల్లో విహరిస్తూ
ఇంత పచ్చిగా ఉందేం
అని తోటమాలిని ప్రశ్నిస్తే
ఇది లవర్స్ పార్క్
కళ్ళు మూసుకోండి
ఇది మానని పుండు
మందేయకండి అని జవాబు
కళ్ళు మూసుకున్నా
గుబురు పొదల వెనకో
రాతి గదుల చాటునో
రెండు శరీరాలు కదుల్తున్న శబ్దం
అందరూ టీనేజర్లే
పతనమవుతున్న నా సంస్కృతికి
నిలువెత్తు నిదర్శనాలు
ఇది దుర్గం చెరువా
కాదు దుర్గంధ చెరువు
నా దేశపు గుండెల మీద
మొలిచిన హిమాలయాలంత బరువు

-సలీం

ఎవరినో తెచ్చి ఇస్తానంటే కుదరదు" అంది మంగతాయారు.

"మీ అమ్మగారితో అలా చెప్పారేంటి? ఎవర్నయినా తెచ్చి పెంచుకుందామని మీ ఉద్దేశమా" పడుకోబోయే ముందు శ్రీరాంని అడిగింది విశాలి.

"ఓ అనాథను తెచ్చి పెంచుకుందాం" అని తన మనసులోని నిర్ణయాన్ని వెల్లడించాడు శ్రీరాం.

"అదే మంచిదిలేండి. చుట్టాల పిల్లలయితే లేనిపోని గొడవలు" అని ముక్తాయించింది విశాలి.

ఆరు నెలలు గడిచినా కోడలు నెలతప్పిన సూచనలు ఏమీ కనబడలేదు మంగతాయారుకు. కొడుకును పిలిచి గట్టిగా నిలదీసింది. "నా మాట విని మళ్ళీ పెళ్ళిచేసుకో. మన వంశం నిలబడాలనేరా నా ఉద్దేశం. నేను పెళ్ళి ఏర్పాట్లలో ఉంటాను. నువ్వు నీ భార్యను పుట్టింటికే పంపుతావో, విడాకులే ఇస్తావో నాకు తెలియదు. రెండో పెళ్ళి మాత్రం చేసుకుని తీరాల్సిందే. నేను బతికుండగానే వంశాంకురాన్ని ఎత్తుకోవాలి" అంది మంగతాయారు.

ఈ మాటలు విన్న విశాలి ఆవేశంతో దూకుడుగా బయటకు వచ్చింది. "మీ అబ్బాయికి రెండో పెళ్ళి కూడా చేశాక పిల్లలు పుట్టకపోతే ఏం చేస్తారు? మూడో పెళ్ళికి సిద్ధపడతారా?" అని అత్తను నిలదీసింది.

"చేస్తానే, చేస్తాను. పిల్లల కోసం ఎన్ని పెళ్ళిళ్ళయినా చేస్తాను. నాకు మనవడు కావాలి. నువ్వు ఎటూ కనలేకపోయావు. ఈసారి వచ్చే కోడలైనా కనిస్తుంది నాకు మనవడిని. కాయలు కాయని చెట్టును కొట్టేస్తాం. కొత్త మొక్కను నాటుతాం. ఇదీ అంతే అనుకో" అంది అంతే పౌరుషంగా మంగతాయారు.

"మీ అబ్బాయికి మీరు ఎన్ని పెళ్ళిళ్ళు చేసినా లాభంలేదు. పిల్లలు పుట్టరు. నేను మీ అబ్బాయికి విడాకులు ఇచ్చేసి మరో పెళ్ళి చేసుకుంటాను. నాకూ తల్లిని కావాలని ఉంది. ఇన్నాళ్ళు కాపురం చేసినా నా కడుపు పండలేదు. మీరు పెట్టిన గడువూ తీరిపోయింది. విడాకులు ఇవ్వడానికి నేను సిద్ధంగానే ఉన్నాను" అంది విశాలి.

ఊహించని ఆ మాటలకు కొంత కంగుతిన్న మంగతాయారు, "అవ్వ! ఎంతలేసి మాటలంటున్నావే! లోపం నీలో ఉంచుకుని నా కొడుకునే తప్పుపడతావా? నువ్వు రెండో పెళ్ళి చేసుకుంటావా? నా కొడుకు మగాడు. ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకున్నా తప్పులేదు. ఆడదానికి ఒకటే పెళ్ళి, ఒకడే భర్త" అంది.

శ్రీరాం వారి వాదనలు వింటూ మౌనంగా ఉన్నాడు. అది చూసిన మంగతాయారుకు మరింత చిర్రెత్తిపోయింది.

"ఏరా! దద్దమ్మా. అలా నిలబడి చూస్తావేంట్రా. నీ భార్య ఎంతలేసి మాటలంటుంతో విన్నావా. లోపం నీలో ఉందట. నీకు విడాకులిచ్చేసి మరో పెళ్ళి చేసుకుంటుందట. ఈడ్చి చెప్పుమీద ఒకటి ఇవ్వకుండా అలా చూస్తూ ఊరుకుంటావేమిరా?" అంటూ కొడుకును రెచ్చగొట్టే ప్రయత్నం చేసింది మంగ తాయారు.

"చూస్తూ ఊరుకోక ఏమి చేయమంటావు. విశాల్ని అన్నదాంట్లో తప్పేముంది. ఆమెలో ఏ లోపం లేదు. నాలోనే లోపం ఉంది. ఆమెకు పిల్లలు పుట్టలేదని నన్ను మరోపెళ్ళి చేసుకోమన్నావు. అదే నీతి విశాలికి వర్తించదా?" అని తల్లిని నిలదీశాడు శ్రీరాం.

ఆ మాటలు వింటూనే మంగతాయారు మ్రాన్పడిపోయింది. వినకూడని విషయం విన్నట్టుగా విలవిల్లాడిపోయింది. కొంచెం తేరుకుంటూ, "అసలు నీలో లోపం ఎందుకు ఉంటుంది? డాక్టర్లు సరిగా పరీక్షలు చేశారా? లేదా కావాలని నువ్వే ఇలా మాట్లాడుతున్నావా?" అని అనుమానంగా కొడుకువైపే చూస్తోంది మంగ తాయారు.

"ఎవరైనా లేని తప్పును నెత్తిమీద వేసుకోరు. విశాలి మీద అనవసరంగా అభాండాలు వేశాడు. మళ్ళీ పెళ్ళికి దారి తీయించావు. ఆడవారయినా, మగవారయినా మనుషులే కదా. లోపం ఆడవాళ్ళలోనే ఉండాలని ఏమీ లేదుగా. మగవారిలో కూడా ఉండొచ్చు కదా. నా వల్ల పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టర్లు ఖచ్చితంగా చెప్పారు. మరి ఇప్పుడు చెప్పు, విశాలికి మళ్ళీ పెళ్ళిచేస్తావా? లేకపోతే అనాథను తెచ్చి పెంచుకోమంటావా?" అని తల్లిని నిలదీశాడు శ్రీరాం.

అప్పటికే కుర్చీలో కూలబడిపోయిన మంగ తాయారు చీర కొంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, బేలగా కోడలివైపు చూస్తూ ఉండిపోయింది. ఇన్నాళ్ళు కోడలిని బాధపెట్టినందుకు తనలో తనే కుమిలిపోతోంది.

"విశాలీ! నన్ను క్షమించమ్మా. నిన్ను ఎన్నో అనరాని మాటలన్నాను. నీ మనసు ఎంతో కష్టపెట్టాను. అయినా నువ్వు సహనంతో అన్నీ భరించావు. నా కొడుకులో లోపం ఉంచుకుని నిన్ను తప్పుబట్టాను. ఇకమీదట నిన్నేమీ అనను. నా కొడుకును విడిచి మాత్రం వెళ్ళొద్దమ్మా. మీకు ఇష్టమున్న పిల్లాడిని తెచ్చి పెంచుకోండి. వాడితో కాలక్షేపం చేస్తాను. పెద్దదాన్ని, నీ తల్లిలా భావించి నన్ను క్షమించమన్నా" అని వెక్కిళ్ళు పెట్టింది మంగతాయారు.

"అంత మాట అనకండి అత్తయ్యగారు. లోపం ఎవరిలో ఉన్నా బాధ ఒకటే. రేపు అనాథాశ్రమం నుంచి ఓ బాబును తెచ్చుకుందాం" అని అనునయించింది విశాలి.

ఆ మాటలకు అందరి ముఖాల్లోనూ ఆనందం వెల్లివిరిసింది.

■

## వయసుడిగిన కుమ్మరి

సాలె గూడులా
చతికిలపడ్డ దేహంలో
మిణుగురు పురుగుల్లా
మెరిసే కనుగుడ్లు
అలుపెరుగని గడియారం ముల్లుకు
ఆగుదల సంక్రమించినట్టు
తిరిగే వలయంలో
శిథిలపు పగుళ్ళు
ఆర్జితం అనుబంధాల పాలైనప్పుడు
ఆదుకునే పొరుగు చేతుల చూసి
శుష్కించిన అవయవాలను
పలుకరించే నులుక మంచం
కుమ్మరి సారెతో
కలిసి తిరిగిన కాలచక్రం
చెమటను సెలయేరుగా మార్చి
బ్రతుకు బానలను తీర్చిదిద్ది
పెనవేసిన బంధుత్వాన్ని
కనుమరుగు చేసింది
మోస ద్వేషాలు కోట్లు గడిస్తుంటే
నిస్వార్థం నిలుచున్న చోటే విగ్రహమై
అభివృద్ధిని ఆటంకపరిచింది
మలుపు రూపాలతో
మంటలో ఎరుపెక్కి
మనుగడకు తోడ్పడిన మట్టి మాత్రం
ఆదరణగా హస్తమెత్తి
వృద్ధుడా... ఉదరంలో దాగుమంటుంది.

-వూట్ల భద్రయ్య